ప్రజాశక్తి

శనివారం 10 డిసెంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మాండూస్ ముప్పు

- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో వరిపై తీవ్ర ప్రభావం
- మత్స్యకారులు వేటకెళ్లరాదంటూ జిల్లా యంత్రాంగం హెచ్చరికలు
- విశాఖ, గంగవరం పోర్టుల్లో రెండో హెచ్చరిక జారీ



ఆర్‌కె బీచ్‌లో ఎగసిపడుతున్న సముద్ర కెరటాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన 'మాండూస్' తుపాను ప్రభావం విశాఖ జిల్లాపై తీవ్రంగా పడనుంది. ముఖ్యంగా గ్రామీణ మండలాలైన పద్మనాభం, భీమునిపట్నం, ఆనందపురంల్లో వరి కోత కోసి కుప్పలుగా వేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు. తుపాను ప్రభావంతో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు కొన్నిచోట్ల పంట నేలరాలిపోయింది. చేతికొచ్చిన పంటను పలుచోట్ల కుప్పలుగా వేసుకున్నారు. కురిసిన చెదురు, మదురు వర్షాలతో కుప్పలు వేసిన ధాన్యం రంగుమారిపోతుందన్న ఆందోళన ఈ ప్రాంత రైతుల్లో నెలకొంది.

గంటకు 75 నుంచి 85 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో వరి కుప్పలు చెల్లాచెదురయ్యాయి. మాండూస్ తుపాను 2020లో వచ్చిన నవర్, 2018లో వచ్చిన గజ తుపాను కంటే బలమైనదని పలువురు వాతావరణ నిపుణులు భావిస్తున్నారు. అందువల్ల గాలులు, వర్షాలు భారీగానే ఉంటాయని తెలుస్తోంది. రాష్ట్రంలోని దక్షిణ కోస్తాలో ఈ ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే వెల్లడించింది. ఉత్తర కోస్తా ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ ఈదురు గాలులు, వర్షాలు ఉంటాయి. సముద్రంపై మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని జిల్లా అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీచేసింది. మరో రెండు రోజులపాటు మత్స్యకారుల వేట నిషేధం అమల్లో ఉంటుంది. 10న కూడా ఈ తుపాను ప్రభావం ఉండడంతో మరింత ఆవేదనకు రైతులు గురౌతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వ్యవసాయ శాఖ రైతులకు

మిగతా 2లో..



విశాఖ నగరంలో శుక్రవారం రాత్రి కురుస్తున్న వర్షంలో జనం రాకపోకలు

15 వేల ఎకరాల్లో కోసిన వరిచేను

వర్షాలు ఎక్కువపడితే నష్టపోనున్న రైతులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లా రైతుల్లో మాండూస్ తుపానుతో భయం నెలకొంది. శుక్రవారం సాయంత్రం నుంచి గాలులు వీయడం, వర్షాలు పడ్డంతో వరి కోతలు కోసిన రైతులు పంటలు పోతాయని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని ఈ ఖరీఫ్‌లో 1.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. దీంట్లో 50 వేల ఎకరాల వరకు కోసిన చేను కుప్పలు వేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కుప్పలు వేసిన చేనుకు వర్షాలు పడినా పరవాలేదని వీరు చెబుతున్నా, వర్షాల భయానికి ఎండక ముందు కుప్పలు వేసిన వరి చేను కుళ్లిపోయి రంగుమారుతుందని రైతులు అంటున్నారు. పండిన పంట సకాలంలో కోయకపోతే వెన్నురాలుతుందని కోసిన వరిపంట సుమారు 15 వేల ఎకరాల వరకు వుంటుంది. మరో 50 వేల ఎకరాలు కోతకు సిద్ధంగా ఉండగా, కొంతకాలం క్రితం 15 వేల ఎకరాల్లో కోసి నూర్పిడి చేసినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాలు ఎక్కువ పడితే రెండ్రోజుల క్రితం కోసిన 15 వేల ఎకరాల్లో వరిచేను దెబ్బతింటుందని రైతులు భయపడుతున్నారు. కోతకు సిద్ధంగా వున్న వరి పంట గాలికి వెన్ను విరిగిపోవడం, పంట నేలమట్టమయ్యాక వర్షాలు పడితే పంట చేతికిరాకుండా పోతుందన్న ఆందోళన

మిగతా 2లో..



నక్కపల్లిలో వరి కుప్పలు వేస్తున్న రైతులు

స్మార్ట్ సిటీ పనులు వేగవంతం చేయండి

వార్త 2లో..

హృద్రోగ చిన్నారులకు రోటరీ సేవలు అభినందనీయం

వార్త 4లో..

విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ పోటీలు ప్రారంభం

వార్త 4లో..

'మధ్యాహ్నం' మెనూ అమలు చేయాల్సిందే..

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం ప్రతి రోజూ విద్యార్థులకు భోజనం అందించాల్సిందేనని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 1 నుంచి 7 స్థాయీ సంఘ సమావేశాలు ఆమె అధ్యక్షతన జరిగాయి. ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమం, వ్యవసాయం, డ్వామా, బిసి, ఎస్‌సి సంక్షేమం, హౌసింగ్ పథకాలకు సంబంధించి మండలాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు - నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, మధ్యాహ్న భోజన పథకం, జగనన్న గోరుముద్ద తదితర అంశాలపై జిల్లా విద్యాశాఖాధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రతినిధులు వారి పరిధిలో ఉన్న పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అన్నారు. గ్రామాలలో ఉన్న పిహెచ్‌సిలలో శాశ్వత ప్రాతిపదికన డాక్టర్లను నియమించాలని, వైద్య ఆరోగ్య శాఖాధికారిని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ శ్రీరామమూర్తి, డిప్యూటీ సిఇఒ సత్యన్నారాయణ, పలువురు

మిగతా 2లో..



మాట్లాడుతున్న సుభద్ర

'ఉక్కు'ను పూర్తి సామర్థ్యంతో నడపండి

- స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభ డిమాండ్
- ప్రజా ఉద్యమంతో కర్మాగారాన్ని కాపాడుకుంటామన్న నేతలు

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, తక్షణమే బ్లాస్ట్ ఫర్నేస్ - 3లో ఉత్పత్తిని ప్రారంభించాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) 11వ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉక్కునగరంలోగల స్టీల్‌క్లబ్‌లో ఎన్.శేషగిరిరావు ప్రాంగణంలో శుక్రవారం సంఘం మహాసభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. కార్మిక చట్టాలను మార్చి యజమానులకు కార్మికులను కట్టు బానిసలుగా మార్చేస్తోందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను ఉద్యమాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రెండు సంవత్సరాలుగా జరుగుతున్న ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమం వల్ల విశాఖ ఉక్కు పరిశ్రమ దగ్గరకు రావడానికి కేంద్రం భయపడుతోందని అన్నారు. సోవియట్ యూనియన్ సహకారంతో భారతదేశంలో పలు పరిశ్రమలు ఏర్పాటు చేయగా మోడీ ప్రభుత్వం ప్రభుత్వ పరిశ్రమలను అమ్మడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే

మిగతా 2లో..



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జగ్గునాయుడు, వేదికపై సిహెచ్.నర్సింగరావు, తదితరులు

మొదటి పేజీ తరువాయి..

మాండూస్ ముప్పు

తగు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు మండలాధికారులను అప్రమత్తం చేస్తోంది.

అల్లకల్లోలంగా సముద్రం

మరోవైపు విశాఖ తీరంలో సముద్రం పూర్తిగా అల్లకల్లోలంగా మారిపోయింది. తుపాను గాలులతో శుక్రవారం సాయంత్రం విశాఖ అంతటా కారుమబ్బులు కమ్మేశాయి. వర్షం సాయంత్రం నుంచి పడడంతో చలి తీవ్రత పెరిగింది. శుక్రవారం ఉష్ణోగ్రతలు 23 డిగ్రీల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. విశాఖ, గంగవరం పోర్టుల్లో రెండో నెంబరు హెచ్చరిక జెండాను ఎగరవేశారు.

15 వేల ఎకరాల్లో కోసిన వరిచేను

చెందుతున్నారు. ఈ వర్షాలు జీడిమామిడి, మామిడికి ఉపయోగకరంగా వుంటాయని ఉద్యానశాఖాధికారులు చెబుతున్నారు. అధిక వర్షాలు పడితే జీడిమామిడి పూతకు ఇబ్బందిలేకున్నా, మామిడి చెట్ల చిగురు దెబ్బతినే అవకాశం ఎక్కువగా వుంది. దీనివల్ల మామిడి పూత తగ్గుతుంది. జిల్లాలోని తీరప్రాంత మండలాలైన పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడకు చెందిన మత్స్యకారులను సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యశాఖాధికారులు మూడ్రోజుల నుంచి చెబుతున్నారు. సముద్రంలో చేపలవేటకు మత్స్యకారులు వెళ్లలేదని జిల్లా మత్స్యశాఖాధికారి లక్ష్మణరావు తెలిపారు.

'ఉక్కు'ను పూర్తి సామర్థ్యంతో నడపండి

పలు పరిశ్రమలను గత ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయని, వాటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతులకు ఉపాధి కల్పించాయని గుర్తు చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాట కమిటీ ఉద్యమం ఉధృతంగా నడుస్తున్న సమయంలోనూ బిజెపి ఎంపీ జివిఎల్.నరసింహారావు ఉక్కునగరం వచ్చి బయటకు వెళ్లారని, అలాంటి నాయకులను అక్కడికక్కడే నిలబెట్టి నిలదీయాలని తెలిపారు. ఈ మేరకు కార్మికులను చైతన్యవంతం చేయాలని అన్నారు. ప్రజా పోరాటాలతో ఉక్కును కాపాడుకుంటామన్నారు. రైతుల ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉక్కు కార్మికులు పోరాటాన్ని కొనసాగించాలని అన్నారు. ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో వామపక్షాలు నిలకడైన వైఖరితో ఉన్నాయన్నారు. మిగిలిన పార్టీలు ఆ విధంగా లేకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. బిజెపి ప్రభుత్వం ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని, దాని పట్ల అప్రమత్తంగా ఉంటూ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి వైటి.దాస్ నివేదిక ప్రవేశపెట్టారు.

మహాసభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు బి.గంగారావు, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నాయకులు ప్రద్యుత్ ముఖర్జీ, నంబేందు సర్కార్, విశాఖ జిల్లా సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో కన్వీనర్ కె.కుమార మంగళం, వివిధ ప్రభుత్వ రంగ పరిశ్రమల అధ్యక్ష, కార్యదర్శులు, స్టీల్ సిఐటియు సీనియర్ నాయకులు ఎం.కృష్ణారావు, ఎన్.రామారావు, జె.సింహాచలం, ప్రస్తుత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.అయోధ్యరామ్, వైటి.దాస్, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

'మధ్యాహ్నం' మెనూ అమలు చేయాల్సిందే..

జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

పేదరికం లేని గ్రామాల రూపకల్పనే లక్ష్యం

ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా వెళ్లాలంటే గ్రామ సభలు, సమావేశాలు గ్రామాలలో నిర్వహించాలని సుభద్ర అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ప్రణాళికా ప్రచారం - 2022 కార్యక్రమంలో భాగంగా జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, జిల్లా అధికారులకు జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. 73వ రాజ్యాంగ సవరణ చట్టం 11వ షెడ్యూల్డులో పేర్కొన్న ప్రభుత్వ శాఖల సమన్వయంతో, ప్రజల భాగస్వామంతో అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలన్నారు.

వచ్చే ఎన్నికల్లో విశాఖ నుంచి పోటీ చేస్తా

- సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వచ్చే ఎన్నికల్లో విశాఖ నుంచి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తానని సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఏ పార్టీ నుంచి పోటీ చేస్తాననే విషయం ఇప్పుడే చెప్పలేనని స్పష్టం చేశారు. అయితే సుమారుగా తను ఇండిపెండెంట్ అభ్యర్థిగానే బరిలోకి దిగుతానని చెప్పారు. ఇప్పటివరయిజూ తనని ఏ పార్టీ సంప్రదించలేదని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. ఎన్నికల సమయం దగ్గర పడే సమయంలో రాజకీయ పార్టీలు తనని సంప్రదించే అవకాశాలు కూడా లేకపోలేదని పేర్కొన్నారు. 2019 ఎన్నికలలో విశాఖలోనే తాను పోటీ చేసానని, ఆ సమయంలో విశాఖ ప్రజలు తన మీద ఎంతో అభిమానం చూపారని చెప్పారు. తను ఓడిపోయినప్పటికీ ఇక్కడ ప్రజల మనసులో ఒక కుటుంబ సభ్యునిగా చిరస్థాయిగా ఉండిపోయానని తెలిపారు. విశాఖ ప్రజల ప్రేమ మరవలేనని అన్నారు. మళ్లీ తాను ఇక్కడి నుంచే పోటీ చేయాలని తన శ్రేయోభిలాషులు, విశాఖ ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఎస్ఐ, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జెడి ఫౌండేషన్, ఐఎసిఇ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ ఏర్పాటు చేశామని, ఇది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో ఉంటుందన్నారు. ఈ నెల 11న ఎపిలో 35 కేంద్రాలలో ముందుగా దరఖాస్తు చేసుకున్న సుమారు 42 వేల మందికి మోడల్ పరీక్షను నిర్వహిస్తామన్నారు. ఇందులో మెరిట్ సాధించిన వెయ్యి మందిని ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తామని తెలిపారు.

స్మార్ట్ సిటీ పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్మార్ట్ సిటీ నిధులతో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా దసపల్లా హిల్స్, టౌన్ కొత్త రోడ్, ఏయూ అవుట్ గేట్, కిర్లంపూడి లే-అవుట్ తదితర ప్రాంతాలలో స్మార్ట్ సిటీ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులతో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.3.14 కోట్లతో దసపల్లా హిల్స్ ఊటగెడ్డ పార్కును పరిశీలించి దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు.

జగన్ పాలనపై వ్యతిరేకత

కలెక్టరేట్ : జగన్ ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత ప్రజల్లో వ్యక్తమవుతోందని టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అన్నారు. జివిఎంసి 31వ వార్డులో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.

దోమల నియంత్రణతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న కార్పొరేటర్ సుధ

ప్రజాశక్తి - ములగాడ :61వ వార్డు పల్లివీధి సచివాలయం పరిధిలో జివిఎంసి, సచివాలయం, డిఎంఒ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యాన శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ మాట్లాడుతూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు వారంలో ప్రతిశుక్రవారం డ్రైడే పాటించడం ద్వారా దోమలు,వాటి లార్వాలను నియంత్రించి, సీజనల్ వ్యాధులు నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఇళ్లల్లోని తడి, పొడి ప్రమాదకర చెత్తగా వేరుచేసి, ఇంటింటా వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన యూజర్ ఛార్జీలను సకాలంలో చెల్లించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఎస్ సూర్యనారాయణ, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి రవికుమార్, ఎంపిహెచ్ఎ రోమాల వేణుబాబు, శానిటరీ సెక్రటరీలు జీ శ్రీనివాసరావు, సునీత పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై అవగాహన



ఓటరు నమోదు పత్రాన్ని అందజేస్తున్న విద్యార్థిని

ప్రజాశక్తి - ములగాడ :18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా తమ పేరును నమోదు చేసుకోవాలని, ములగాడ తహశీల్దార్ డి. వీరభద్రరావు సూచించారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఓటర్ నమోదుపై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను, బాధ్యతలను వివరించి, అర్హులంతా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసెల్లా మాట్లాడుతూ, ఒకప్పుడు ఓటరుగా నమోదు చేసుకోవాలంటే కార్యాలయాల వద్దకు వెళ్లే పరిస్థితి నుంచి నేడు అధికారులే ఓటర్ల వద్దకు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించడం, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడం శుభపరిణామమన్నారు. ఆర్ఐ రమ, ఎన్నికల సూపర్‌వైజర్ శ్వేత, సచివాలయ అడ్మిన్ శ్రీవసంత్, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్, రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు వై. అనసూయా దేవి, బూత్ లెవెల్ ఆఫీసర్లు హుస్సేన్, బాలాజీ, మహేష్ ,ఉత్తమ్, వెంకటలక్ష్మి, దివ్య, సమీరా భారతి పాల్గొన్నారు.

మంచినీటి పరీక్షలపై శిక్షణ



తాగునీటి పరీక్షలపై శిక్షణ పొందుతున్న అంగన్వాడీ, ఆశాలు

ప్రజాశక్తి- ఆనందపురం : జల జీవన మిషన్ ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించే ఉద్దేశంతో సచివాలయంలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లతో కూడిన ఐదుగురు సభ్యులకు శిక్షణనిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆనందపురం గ్రామ సచివాలయంలో మంచినీటి పరీక్షలు జరపడంపై శిక్షణనిచ్చినట్లు పంచాయితీ కార్యదర్శి శ్రీరామ్ మూర్తి తెలిపారు.

కార్యక్రమంలో మాజీ సహకార సంఘం అధ్యక్షులు చందక సూరిబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జి రమ్య, ఎఎన్ఎం పైడిరాజు, అంగన్వాడీ కార్యకర్త దొంతల కాసులమ్మ, గౌరి, ఆశా వర్కర్లు అన్నపూర్ణ, పద్మ, లక్ష్మి వాలంటీర్ శాంతి కుమారి, విఘ్నేష్ పాల్గొన్నారు

ప్రయాణ సంకటం!

- నిండా గోతులమయమైన గ్రామీణ రహదారులు
- ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని జనం రాకపోకలు
- వాహనాలు, ప్రజలకు నష్టం జరుగుతున్నా పట్టని వైనం



గోతులమయంగా పెంట, అలమండ రైల్వేస్టేషన్ రోడ్డు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల రహదారులు అధ్వానస్థితిలో ప్రజలు అనునిత్యం నానా ఇబ్బందులు పడుతున్నారు. నిండా గోతులమయమై ప్రయాణసంకటంగా ఉన్న పెంట నుంచి అలమండ రైల్వేస్టేషన్ రోడ్డు అందులో ఒకటి. ఈ మార్గంలో ప్రయాణమంటే వాహనదారులు బెంబేలెత్తిపోయే పరిస్థితి ఉంది. పెంట నుంచి కోవ్వాడ, గంధవరం, తిమ్మాపుర,.నారాయణపురం గ్రామాలను ఆనుకుని సుమారు 50 గ్రామాల ప్రజలు నిత్యం ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. అధ్వానంగా ఉన్న రోడ్డుతో వారంతా పడే కష్టాలు చెప్పనలవికాదు. అలాగే విజయానందపురం నుంచి ఎపిఎస్‌పి బెటాలియన్‌కు పోవు రోడ్డు కూడా వీటిని తీసిపోయేలా దయనీయంగా ఉందని ఆరోపిస్తున్నారు.

ఈ మార్గంలో ప్రయాణమంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లడమేనని, గమ్యం చేరేవరకు ఏం జరుగుతుందో తెలియని ఆందోళనకర పరిస్థితిలో ప్రయాణం సాగించక తప్పడం లేదని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. నిండా గోతులతో ఉన్న రోడ్డులో కుదుపులు ప్రయాణం వల్ల ఒంటినొప్పులు, ఇతర అనారోగ్య సమస్యలతోపాటు, వాహనాలు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'యువశక్తి'తో భవిష్యత్‌పై భరోసా

జనసేన రాజకీయ వ్యవహారాల ఇన్‌ఛార్జి నాదెండ్ల మనోహర్



మాట్లాడుతున్న జనసేన నేత నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి- సీతమ్మధార : యువతరంలోని శక్తిని, నైపుణ్యాలను వెలికితీసి, వారికి భవిష్యత్‌పై భరోసా కల్పించేలా దిశానిర్దేశం చేసే లక్ష్యంతోనే జనసేన ఆధ్వర్యాన 'యువశక్తి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. శుక్రవారం పబ్లిక్ లైబ్రరీలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనవరి 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జనసేనాని పవన్‌కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, యువత కోసం భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలు, వలసల నిరోధానికి చర్యలపై ప్రసంగిస్తారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కష్టపడిన ప్రతి ఒక్కరినీ ఈ వేదిక మీదకు తీసుకొస్తామన్నారు.

పేదల ఇళ్ల విషయంలో వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, జగనన్న కాలనీ ఒక పెద్ద కుంభకోణమన్నారు. మూడు నెలల్లో ఎపి ఆస్తులను తెలంగాణకు కట్టబెట్టేసి, ఇప్పుడు ఉమ్మడి రాష్ట్రమైతే బాగుంటుందని ప్రజలను అయోమయస్థితిలోకి నెట్టుతున్నారని విమర్శించారు. విజయవాడలో బిసి గర్జనకు ఆర్‌టిసి బస్సులను తరలించడం ద్వారా ఎపిఎస్‌ఆర్‌టిసిని వైఎస్‌ఆర్‌టిసిగా మార్చేశారని ఎద్దేవా చేశారు. సమావేశంలో జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి.శివశంకర్, పెదపూడి విజయ్ కుమార్, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, పార్టీ నేతలు పరుచూరి భాస్కరరావు, సందీప్ పంచకర్ల, పివిఎస్ఎన్.రాజు, పసుపులేటి ఉషా కిరణ్, వంపూరు గంగులయ్య, కల్యాణం శివ శ్రీనివాస్, గడసాల అప్పారావు, ఎ.దుర్గా ప్రశాంతి, డా.మూగి శ్రీనివాస్, నాగలక్ష్మి, శరణి పాల్గొన్నారు.

గీతంలో ఐర్లాండ్ ఎడ్యుకేషన్ ఫెయిర్



'గీతం' అధ్యక్షుడు శ్రీభరత్‌తో ఐర్లాండ్ సెనెటర్ బెన్

ప్రజాశక్తి- మధురవాడ :ఐర్లాండ్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహనకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్ ఐర్లాండ్ సెనేటర్ మాల్కం బైన్ ప్రారంభించారు. విదేశీ విద్యార్థులకు అక్కడి ప్రభుత్వం అందిస్తున్న స్కాలర్ షిప్‌లు, ఉచిత విద్యారంగం, విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లను విద్యార్థులకు వివరించారు. ఈ ఎడ్యుకేషన్ ఫేర్‌లో ఐర్లాండ్‌లోని మేనూత్ విశ్వవిద్యాలయం, సౌత్ ఈస్ట్ టెక్నలాజికల్ యూనివర్శిటీ, నేషనల్ కాలేజ్ ఆఫ్ ఐర్లాండ్, అట్లాంటిక్ టెక్నలాజికల్ యూనివర్శిటీ, షన్నాన్, గ్రిఫిత్, ట్రినిటీ, గాల్వే తదితర విద్యాలయాల ప్రతినిధులు పాల్గొని తాము నిర్వహిస్తున్న కోర్సులు, ఉపకార వేతనాలను వివరించారు. ఈ సందర్భంగా గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్‌ను ఐర్లాండ్ సెనేటర్ మాల్కం బైన్ మర్యాదపూర్వకంగా కలిసి వివిధ విద్యా సంబంధ అంశాలపై చర్చించారు. గీతంలోని వివిధవిభాగాలను సందర్శించారు. కార్యక్రమంలో గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, అకడమిక్ ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ఎక్సటర్నల్ రిలేషన్స్ అసోసియేట్ డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో వివాదాలు పరిష్కారం

గీతం న్యాయసదస్సులో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నాగేశ్వరరావు

ప్రజాశక్తి- మధురవాడ : దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న వివాదాలను సత్వరం, సముచితంగా పరిష్కరించుకోవడానికి మధ్యవర్తిత్వం సరైన మార్గమని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, న్యాయకళాశాల ఆధ్వర్యంలో వర్చ్యువల్ విధానంలో నిర్వహిస్తున్న 'నూతన శతాబ్ధిలో వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా దేశంలో వివాదాల పరిష్కారానికి ఏళ్ళ తరబడి అనుసరిస్తున్న ప్రత్యామ్నాయ న్యాయ పరిష్కార మార్గాలను వివరించారు. న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులు, పరిశోధకులు మీడియేషన్, ఆర్బిట్రేషన్ అంశాలపై లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు.

గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్, వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు, సదస్సు కన్వీనర్ డాక్టర్ లక్ష్మణరావు పాల్గొని ప్రసంగించారు.

ఉజ్వల్‌కుమార్‌కు గవర్నర్ అభినందన



గవర్నర్ నుంచి ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న ఉజ్వల్ కుమార్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశ్రాంత సైనిక ఉద్యోగుల సంక్షేమానికి ఆంధ్రవిశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్, ఎయు, రక్షణ రంగాల ఉద్యోగుల కార్యక్రమాల సమన్వయకర్త డాక్టర్ ఉజ్వల్‌కుమార్ ఘటక్‌ను చేస్తున్న కృషిని గుర్తిస్తూ, రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఆయనను అభినందించారు. విజయవాడలో సైనిక సంక్షేమశాఖ నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసాపత్రంతో అభినందించారు.

అనధికార నిర్మాణం తొలగింపు



భవనంలోని అనధికార పిల్లర్లను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

ప్రజాశక్తి- సీతమ్మధార: 26వ వార్డు నరవ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న భవనంలో అనధికారికంగా నిర్మిస్తున్న పిల్లర్లను జివిఎంసి, టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం తొలగించారు గతంలో రెండుసార్లు తొలగించినప్పటికీ, బిల్డింగ్ యాజమాన్యం తమకేమీ పట్టనట్లు మళ్లీ నిర్మాణంచేపట్టడంపై స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. అనధికార నిర్మాణాలపై జివిఎంసి యంత్రాంగం తూతూమంత్రపు చర్యలకు ఇది నిదర్శనంగా కనిపిస్తోందని, ఇప్పటికైనా అధికారులు పకడ్బందీ చర్యలకు పూనుకుని, ఆ భవనంలోని అనధికార నిర్మాణం జరుగుతున్న అంతస్తు మొత్తాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో టిపిఒ తేజ, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి ఆర్థిక సాయం




ఆర్థిక సాయాన్ని అందిస్తున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఆనందపురం: పెద్దిపాలెం పంచాయతీ చిట్టిల్ల అగ్రహారంలో అయ్యల సోమరాజుల నరేష్ శర్మ అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శివాలయానికి పెద్దపాలెం గ్రామానికి చెందిన కూరాకుల వెంకటేశ్వరరావు రూ.1,00,116 ఆర్థికసాయాన్ని అందించారు.వెంకటేశ్వరరావు తల్లి అప్పలకొండ జ్ఞాపకార్థం ఈ వితరణ చెక్కును ఆలయ ధర్మకర్తకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు భార్య శ్రీలక్ష్మి, ప్రభుత్వ న్యాయవాది మరుపిల్ల చిన్నయ్యపాత్రుడు, భావిశెట్టి రాజు, గుండు మురళి, పోతన వెంకటప్పరావు పాల్గొన్నారు

సార్వత్రిక టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు తత్కాల్ గడువు పెంపు

ప్రజాశక్తి - ఆరిలోవ : 2022 - 23 విద్యా సంవత్సరానికి సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్ ప్రవేశానికి తత్కాల్ గడువును పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ప్రవేశానికి డిసెంబరు 11 వరకు, ప్రవేశ రుసుము చెల్లించుటకు డిసెంబరు 12 నుంచి 13 వరకు పొడిగించినట్టు తెలిపారు. ప్రవేశ రుసుముతో పాటు పదోతరగతికి రూ 300లు, ఇంటర్‌కు రూ 400 అదనంగా తత్కాల్ రుసుము చెల్లించాలన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా వంశీరెడ్డి జన్మదిన వేడుకలు



వంశీరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నాగేంద్ర

ప్రజాశక్తి-గాజువాక: 74వ వార్డు కార్పొరేటర్, వైసిపి నేత తిప్పల వంశీరెడ్డి జన్మదినం వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గాజువాక నియోజకవర్గంలోని పలువురు అధికారులు, వైసిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి వంశీరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. గజమాలలతో సత్కరించారు. వైసిపి జిల్లా కార్యదర్శి జీలకర్ర నాగేంద్ర పుష్పగుచ్ఛంతో వంశీరెడ్డిని సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించారు.

హెచ్‌డిఎఫ్‌సి సామాజిక సేవలు ప్రశంసనీయం



కాయల వెంకటరెడ్డిని అభినందిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ప్రజాశక్తి- సీతమ్మధార :వ్యాపార లావాదేవీలకే పరిమితం కాకుండా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు ఛైర్మన్ కాయల వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం సీతమ్మధార హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో రక్తదానం డ్రైవ్‌ను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2007లో 4,387 యూనిట్లుతో మొదలైన బ్లడ్ డొనేషన్ స్పెషల్ డ్రైవ్‌ను నేడు ఐదు లక్షల యూనిట్లకు చేరిందంటే ఆషామాషీ కాదని, ఐదు లక్షల యూనిట్లు రక్తాన్ని సేకరించడమంటే, కనీసం ఐదు లక్షలమంది ప్రాణాలను కాపాడడమేనన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న బ్యాంకు సిబ్బంది అభినందనీయులన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రజాప్రయోజన సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాయల వెంకటరెడ్డిని దుశ్శాలువాతో సత్కరించారు. బ్యాంక్ సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- పెందుర్తి : 88వ వార్డు పరిధి నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో లయన్స్ క్లబ్ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానంతో వేరొకరి ప్రాణాలు కాపాడాలని కోరారు. దాతలు ఇచ్చిన రక్తంతో కరోనా సమయంలో వేలాది మంది ప్రాణాలను కాపాడగలిగారన్నారు. రక్తదానం వల్ల దాతకు ఆరోగ్యపరంగా ప్రయోజనం ఉంటుందని, ఏడాదిలో రెండుసార్లు రక్తం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వీరునాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు ఐదో సచివాలయంలో రెండో విడతలో 45 మంది లబ్ధిదారులకు జగనన్న ఇల్లు పట్టాలను శుక్రవారం వార్డు కార్పొరేటర్ కెల్లా సునీత పంపిణీ చేశారు. వార్డు సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వైసిపి నాయకులు బేతా దుర్గారావు, పిల్లి వీర్రాజు, వెంకటరెడ్డి, శ్రీను, సత్యనారాయణ, గోవింద్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గత ఘటనల నేపథ్యంలో అంతటా భయం భయం...!

తుపాను హెచ్చరికలతో
కొండవాలు ప్రాంతవాసుల్లో గుబులు

ప్రజాశక్తి -తగరపువలస : తుపాను హెచ్చరికలతో జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఉన్న పలు కొండవాలు ప్రాంత వాసుల్లో వణుకుపుడుతోంది. కొండవాలు ప్రాంతాల్లో గతంలో చోటు చేసుకున్న ఒకట్రెండు ప్రమాదాల నేపథ్యంలో అక్కడి ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రెండో వార్డు, సత్యనారాయణ పేట కొండవాలు ప్రాంతంలో ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో కురిసిన వర్షాలకు 8వ తేదీ రాత్రి రక్షణ గోడ కూలింది. దీంతో ఆయా



సత్యనారాయణ పేట కొండవాలు ప్రాంతం

ప్రాంతాల్లోని ప్రజలు ఇపుడు రానున్న సూపర్ సైక్లోన్ ప్రభావంపై ఆందోళన చెంద తున్నారు. అప్పట్లో జరిగిన ప్రమాదం నేపథ్యంలో వెంటనే స్పందించిన జివిఎంసి ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఇసుక బస్తాలతో తాత్కాలికంగా ఉపశమన చర్యలు చేపట్టి, అనంతరం రూ.74లక్షల జివిఎంసి నిధులతో రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. అయినప్పటికీ వర్షం కురుస్తుందంటే చాలు కొండవాలు ప్రాంత వాసుల్లో భయం ఛాయలు వెంటాడడం సహజంగా మారిందనే చెప్పాలి.

భయం వెంటాడుతోంది..

గతంలో జరిగిన ప్రమాదాలు ఇంకా కళ్ళ ముందు కదలాడుతూనే ఉన్నాయి. రక్షణ గోడ నిర్మాణం చేపట్టినప్పటికీ భయం నీడలా వెంటాడుతోంది.

- డి.జగన్నాథరావు, కొండవాలు ప్రాంత నివాసి



తుఫాను వస్తే తిప్పలే...

తుఫాన్లు ఎప్పుడు వచ్చినా మాకు ఇబ్బందులే. ఏ క్షణాన ఎలా ఉంటుందో, ఎటువైపు నుంచి ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని స్థితిలో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితి.

-ఆర్.లక్ష్మి



హృద్రోగ చిన్నారులకు రోటరీ సేవలు అభినందనీయం

రోటరీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు స్వీకరణ సభలో సునీల్ గవాస్కర్

ప్రజాశక్తి- మధురవాడ : హృద్రోగంతో పుట్టిన పిల్లలకు రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు చేయడం అభినందనీయమని ఇండియన్ మాజీ క్రికెటర్, కామెంటేటర్ సునీల్ గవాస్కర్ అన్నారు. గుండె సంబంధిత సమస్యలతో పుట్టిన పిల్లలకు ఆపరేషన్లు చేయించి, వారికి సెకండ్ ఇన్నింగ్స్ ప్రసాదించిన ప్రాణదాతలుగా రోటరీక్లబ్ ఇంటర్నేషనల్, రాయపూర్ శ్రీసత్యసాయి సంజీవని ఆసుపత్రి నిలుస్తారని సునీల్ గవాస్కర్ కొనియాడారు. సాగర్‌నగర్ రాడిసన్ బ్లూలో రోటరీక్లబ్ ఇంటర్నేషనల్ 'విశాఖ విస్టా' పేరుతో నిర్వహించిన మూడు రోజుల కార్యక్రమంలో మాట్లాడుతూ, శ్రీసత్యసాయి సంజీవని ఆసుపత్రి లో దాదాపు 2025 మంది హృద్రోగంతో పుట్టిన పిల్లలకు రోటరీక్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించి, చిన్నారులకు ప్రాణదానం చేయడం విశేషమన్నారు. పై ఆసుపత్రిలో ఓన్లీ దిల్ ..నోబిల్ అని చమత్కరించారు. ఆపరేషన్ అనంతరం చిన్నారుల తల్లిదండ్రుల ముఖంలో కనిపించే ఆనందం డబుల్ సెంచరీ కొట్టిన దాన్ని మించిపోతుందన్నారు. తాను, తన కుటుంబం 50 ఏళ్లగా శ్రీసత్యసాయి భక్తులుగా ఉన్నామని, తన ఫస్ట్ ఇన్నింగ్స్ సక్సెస్ ఫుల్ క్రికెటర్‌గా, సెకండ్ ఇన్నింగ్స్ కామెంటేటర్‌గా విజయవంతమైందని, థర్డ్ ఇన్నింగ్స్‌ను హృద్రోగ పిల్లలకు సాయం చేయడం ద్వారా దిగ్విజయం సాధించినట్లుగా



లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకుంటున్న గవాస్కర్

భావిస్తానన్నారు. రోటరీక్లబ్‌తో తన అనుబంధం జీవితాంతం వుంటుందన్నారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును సునీల్ గవాస్కర్‌కు రోటరీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ జెనీఫర్ జోన్స్, రోటరీ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ కిషోర్ కుమార్ చెరుకుమిల్లి, రోటరీ ఇంటర్నేషనల్ డైరక్టర్ మహేష్ కొటబాగి అందజేశారు. ఈసందర్భంగా సునీల్ గవాస్కర్ సంతకం పెట్టిన క్రికెట్ బ్యాట్‌ను వేలంలో రోటరీ పవన్‌అగర్వాల్ దక్కించుకున్నారు. మరో ముఖ్యఅతిథి పద్మభూషణ్ రఘునాథ ముసిల్కర్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలు, స్వచ్ఛంద కార్యక్రమాలు నేటి యువత ప్రేరణగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

'గీతం'లో విభిన్న ప్రతిభావంతుల
క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ :తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో గీతం వేదికగా నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతుల సౌత్ ఇండియా వీల్‌ఛైర్ క్రికెట్ కప్ పోటీలను గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ శుక్రవారం ప్రారంభించారు. ఈనెల 13వరకు జరగనున్న పోటీల్లో కేరళ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 120 మందికి పైగా వికలాంగ క్రికెటర్లు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తానా ఫౌండేషన్ క్రీడా విభాగం కోఆర్డినేటర్ శశాంక్ యార్లగడ్డ మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతుల్లో క్రీడాస్ఫూర్తిని నింపడానికి ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారిగా ఈ తరహా పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రారంభ కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, విజ్ఞాన్ కళాశాల రెక్టార్ వి.మధుసూదన



పోటీలను ప్రారంభిస్తున్న గీతం అధ్యక్షుడు శ్రీభరత్

రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అరుంధతి, సురక్షా ఆసుపత్రి మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ బి.రావు, ఆంధ్రప్రదేశ్ వీల్‌ఛైర్ అండ్ డిజెబిలిటీ క్రికెట్ అసోసియేషన్ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు రుక్మాకరరావు, కార్యదర్శి రామన్ సుబ్బారావు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



ఆర్థికసాయమిచ్చి,విద్యార్థులను అభినందిస్తున్న వైస్ ఎంపిపి శ్రీను

ప్రజాశక్తి - ఆనందపురం: రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో గిడిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఈనెల 4న తేదీన కర్నూల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి విక్టరీ షాటో గుజిరియా కరాటే పోటీలలో పాల్గొన్న విద్యార్థుల్లో నలుగురు చెరో రెండేసి బంగారు, రజత పతకాలను సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వైస్‌ఎంపిపి పాండ్రంగి శ్రీను, ఉపాధ్యాయులు అభినందించారు. కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు రూ.10వేలు ఆర్థికసాయం అందించారు.

పాఠశాల శిక్షకుడు కె.రాజు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటేపోటీల్లో పాల్గొన్న గిడిజాల గ్రామానికి చెందిన శినగం చంద్రశేఖర్, కర్రి హేమలత బంగారు పతకాలను, బోదసింగి లికిత, డిబ్బడిపాలెం గ్రామానికి చెందిన శినగం జగన్ రజత పతకాలను సాధించారు. సర్పంచ్ సినగం అప్పలరాజు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు పాల్గొన్నారు.

వేతన సవరణ కోరుతూ
రోడ్డెక్కిన ఉక్కు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : వేతన సవరణ అమలులో నిర్లక్ష్యం, జాప్యాన్ని నిరసిస్తూ విశాఖ ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో ఎఐటియుసి, మిత్రపక్షాలు మహా నిరసన ధర్నా నిర్వహించారు. కెఎస్ఎన్.రావు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో గుర్తింపు యూనియన్ నాయకులు డి.ఆదినారాయణ, మాట్లాడుతూ సెయిల్ మాదిరిగా విశాఖ ఉక్కు కార్మికులకు వేతన సవరణ అమలు చేయాలని కోరారు. ఏప్రిల్ 1 నుంచి వేతన సవరణ ప్రకారం నూతన వేతనాలు అమలు చేస్తామని సిఎండి పలు సందర్భాల్లో చెబుతూ వచ్చి, ఏప్రిల్ నుంచి ఆగస్టుకు, ఆగస్టు నుంచి డిసెంబర్‌కు వాయిదా వేస్తూ వచ్చారని, తీరా డిసెంబర్ వచ్చేసరికి తనకు తెలియదంటూ తప్పుకోవడం, స్టీల్ సెక్రటరీతో మాట్లాడుకోమంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడడాన్ని తీవ్రంగా గర్హిస్తున్నామన్నారు. ఒకసారి బోర్డు అప్రూవ్ చేసిన వేతన సవరణను అమలు చేయకపోవడం దారుణమని, కడుపు మండిన కార్మికులను రోడ్డెక్కే పరిస్థితులు కల్పించడం సరికాదన్నారు. ఇప్పటికైనా స్పందించి, ఈ ధర్నాను ఒక హెచ్చరికగా భావించి, నిరసన తీవ్రం కాకముందే సెయిల్ మాదిరిగా విశాఖ ఉక్కులో కూడా వేతన సవరణ అమలు జరపాలని డిమాండ్ చేశారు. సాధ్యమైనంత త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. నిరసనలో జె.రామకృష్ణ, జి.గణపతి రెడ్డి, విళ్ళా రామ్మోహన్‌కుమార్, ఎం మహాలక్ష్మి నాయుడు, బి డేవిడ్, బి.కామేశ్వరరావు, డొక్కా నర్సింగరావు, కె.రాజబాబు, కె.బాబురావు, జ్యోతి ప్రసాద్, త్రినాద్, టి.ఈశ్వరరావు, టిఎస్ఎన్, టి.కనకరాజు, ఎల్లేటి శీను పాల్గొన్నారు.

ఎస్ఆర్.పురంలో ఆర్‌డిఒ పర్యటన



జగనన్న కాలనీలో పర్యటిస్తున్న ఆర్‌డిఒ హుస్సేన్

ప్రజాశక్తి- పెందుర్తి : సాధన పర్యటనలో భాగంగానే ఎస్ఆర్ పురం పంచాయతీలో ఆర్‌డిఒ హుస్సేన్ శుక్రవారం పర్యటించారు. జగనన్న కాలనీ, అంగన్వాడి పాఠశాల, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ముందుగా అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ రికార్డులకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే చెప్పాలని రైతులను అడిగారు. జగనన్న కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు

అనర్హుల పేర్లు తొలగించాలని వినతి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు ముసాయిదా జాబితాలో పొరపాట్లును సరిచేయాలని సిపిఎం డిమాండ్



వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేత సాంబశివరావు



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు శ్రీనివాస్, వరలక్ష్మి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లు నమోదులో అవకతవకలను సరిచేయాలని బుచ్చయ్యపేట తహశీల్దారు ఎస్‌వి.అంబేద్కర్‌కు సిఐటియు మండల కార్యదర్శి పి.సాంబశివరావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదులో చాలా చోట్ల అక్రమాలు జరిగాయని, డిగ్రీ ఉత్తీర్ణత లేనివారు కూడా ఓట్ల నమోదు చేయించారని తెలిపారు. అక్రమంగా ఓట్లు నమోదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, అనర్హుల పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

కశింకోట : ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా జాబితాలో పొరపాట్లను సరిచేయాలని సిపిఎం నాయకులు దాకారపు శ్రీనివాసరావు, డిడి.వరలక్ష్మి శుక్రవారం తహశీల్దారు కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలామంది పేర్లు రెండుసార్లు, మూడుసార్లు నమోదు అయి ఉన్నాయని, కొంతమంది ఇంటిపేర్లు మారిపోయాయని తెలిపారు. మూడేళ్ల డిప్లమా ఉన్నవారికి కూడా ఓట్లు ఉన్నాయని, కొందరివి విద్యార్హత వివరాలను పట్టికలో ఖాళీగా చూపించారని తెలిపారు. ఇటువంటి పొరపాటులను సరిదిద్ది సంబంధిత ఓటరుకు తెలియజేయాలని కోరారు.

కె.కోటపాడు : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ముసాయిదా ఓటర్ జాబితాలో ఉన్న అర్హత లేని వారి పేర్లను వెంటనే తొలగించాలని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని పోలింగ్ బూత్ 171, 172 పరిధిలో అర్హత లేని వారు పేర్లు నమోదు చేసి ఉన్నాయని తెలిపారు. వారి వరుస సంఖ్య, గ్రామం, విద్యా అర్హత, వారి పేర్లు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఓటర్ల జాబితాను పరిశీలించి అర్హత లేని వారి పేర్లు వెంటనే తొలగించాలని కోరారు.



కార్మికులతో మాట్లాడుతున్న దేవుడునాయుడు

సిఐటియు జిల్లా మహాసభ ప్రచారం

ప్రజాశక్తి - రాంబిల్లి

ఈ నెల 18, 19 తేదీల్లో పరవాడలో జరగనున్న సిఐటియు జిల్లా 12వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు శుక్రవారం రాంబిల్లి మండలంలో ప్రచారం నిర్వహించారు. మండలంలోని పలు రంగాలకు కార్మికులను కలిశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జి.దేవుడునాయుడు మాట్లాడుతూ ఈ మహాసభలో జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కార్మికులకు రక్షణ కరువైందన్నారు. బడా పెట్టుబడిడారులకు రాయితీలు ఇస్తూ, కార్మికులపై భారాలు వేస్తున్నారని విమర్శించారు. ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ, కార్మికులు జీతాలు పెంచడం లేదన్నారు. పంచాయితీ కార్మికులకు రెండు సంవత్సరాలుగా జీతాలు ఇవ్వలేదని, ఇలా అయితే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. మహాసభలు సందర్భంగా ఈనెల 18న జరిగే బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారని, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

40వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి -రాంబిల్లి

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఒబి నిర్వాసితులు నేవీ మెయిన్ గేట్ వద్ద చేస్తున్న ఆందోళన 40వ రోజు శుక్రవారం కూడా కొనసాగింది. ఎనిమిది గ్రామాల నేవీ నిర్వాసితులు రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎంత వర్షం కురిసినా తమ ఆందోళన కొనసాగితుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడు నాయుడు మాట్లాడుతూ వేలాది మంది నిర్వాసితులు 40 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ఎటువంటి చలనం లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా నిర్వాసితుల గోడు విని వారు న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మండలాభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : దేవరాపల్లి మండల అభివృద్ధికి ముందస్తుగా ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తే మండలాభివృద్ధి జరుగుతుందన్నారు. ఇన్‌ఛార్జిఎంపిడివో జివి రమణ మాట్లాడుతూ ప్రభుత్వ నిధుల ఖర్చు విషయమై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి ఉషశ్రీ, తహశీల్దారు ఎం.లక్ష్మి, ఎంపిటిసిలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి

గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ ప్రారంభం



గ్యారేజ్‌లో చెరకు వేసి క్రషింగ్ ప్రారంభిస్తున్న ఎమ్‌డి సన్యాసినాయుడు

ప్రజాశక్తి- చోడవరం

గోవాడ చక్కెర కర్మాగారంలో శుక్రవారం లాంఛనంగా క్రషింగ్ ప్రారంభమైంది. ఫ్యాక్టరీ ఎమ్‌డి వి.సన్యాసినాయుడు క్రషింగ్ ముహూర్తంగా గ్యారేజ్‌లో చెరుకు కట్టలను వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ క్రసింగ్ మరో ఐదు రోజుల్లో ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ఏడాది 50వేల టన్నులు క్రషింగ్ జరపడానికి సన్నద్ధం చేశామన్నారు. ఫ్యాక్టరీ పరిధిలో ఉడుపు, కారిసె తోట కలిపి 20 వేల ఎకరాల్లో సాగుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది అగ్రిమెంట్‌కు మించి రైతుల నుండి చెరకు సేకరణ జరుగుతుందని, రైతులందరూ ఇది గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో రమణమూర్తి, యూనియన్ నాయకులు కె.భాస్కరరావు ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎంఎల్ కాలేజీ ప్రిన్సిపల్ జయబాబు

ఎంఎంఎల్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎంఎంఎల్ కళాశాలలో శుక్రవారం బీఎస్సీ ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే ప్రణాళికలు వేసుకోవాలన్నారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులంతా సోదరభావంతో మెలగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, వివిధ శాఖాధిపతులు విక్టర్, నిరంజన్, శ్యామల, కొండలరావు, నాయుడు, నాగేశ్వరరావు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు దళారుల బారిన పడొద్దు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన డిప్యూటీ సిఎం బూడి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి

రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించాలని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని ఎం.అలమండ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎ గ్రేడు రకానికి క్వింటాకు రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040 ధర ఇస్తున్నట్లు చెప్పారు. వర్షానికి తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు 21 రోజుల్లో నగదు చెల్లింపు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, జడ్పిటిసి కర్రి సత్యం, సర్పంచ్ దాడి జగన్, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహనరావు, మండల ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్, ఏవో కాంతమ్మ, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ఆసుపత్రిపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధిపైనా దానిపై వస్తున్న వివిధ ఆరోపణలపైనా తక్షణమే అఖిలపక్షం, ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో బీఎస్పీ, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీల నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, వైఎన్.భద్రం, కొణతాల హరినాథ్ బాబు విలేకర్లతో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాగా ఏర్పడినా నుంచి ఆసుపత్రిలో ఆ స్థాయిలో సేవలు అందలేదన్నారు. ఆసుపత్రి సేవలు సదుపాయాలపై అనేక ఆరోపణలు తరచూ వస్తున్నాయని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి నిజా నిజాలు బయట పెట్టాలని కోరారు.

పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని రామగిరి గ్రామంలో సమగ్ర భూ సర్వే పట్టాదారు పాస్ పుస్తకాలను ఎలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని రామభద్రపురం, రాజుపేట, అరబుపాలెం, తిమ్మరాజుపేట, ఒంపోలు, ఉమ్మలాడ, జేపీ అగ్రహారం గ్రామాలకు చెందిన రైతులకు 226 పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమగ్ర భూ సర్వే నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపిపి మళ్ల జయలక్ష్మి, ఎంపిడీవో రవికుమార్, తహశీల్దారు బాబ్జి, వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, పలు గ్రామాల సర్పంచులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

బలహీన వర్గాల సంక్షేమానికి కృషి



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు

సంపద కేంద్రం నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయితీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు భూమిపూజ నిర్వహించారు. పంచాయితీ నిధులతో దీని నిర్మాణం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి చంద్రశేఖర్, ఎంపీటీసీలు పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వార్డు మెంబర్లు రవ్వ శ్రీను, తర్ర సత్యారావు, చదరం చిన్న, నాగరాజు, విజయ్, అర్జున్ నాయుడు, పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె శ్రీనివాసరావు, రామారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉమా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - దేవరాపల్లి : ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ యోజన పథకంలో భాగంగా శుక్రవారం మండలంలోని వేచలం పిహెచ్‌సిలో 36 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారి బి.హరిక మాట్లాడుతూ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, రక్తహీనత ఉన్నవారిని 11 మందిని గుర్తించామని, వీరికి ఇంజక్షన్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. నలుగురు గర్భిణులను హైరిస్క్ కేసులుగా గుర్తించి వారిని ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, వైద్య సిబ్బంది సలహాలు పాటించాలని, ప్రసవ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డి గోవిందరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని భీమవరం పంచాయితీ శింగవరం గ్రామంలో శ్రీసీతారాముల ఆలయ నిర్మాణానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ప్రశాంతంగా ఉండేందుకు దేవాలయం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, హనుమంతు వెంకట లక్ష్మణరావు, మండల మండల అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కొండ్ర శ్రీను పాల్గొన్నారు.

సన్యాసమ్మ ఆలయ నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని వాలాబులో గ్రామ దేవత సన్యాసమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు ఆలయ నిర్మాణానికి రూ.25వేలు, పైలా యువసేన దేవరాపల్లి మండల అధ్యక్షుడు గట్రెడ్డి కొండలరావు (జెకె) రూ.5 వేలు విరాళాలను ప్రకటించారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ గ్రామీణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవంలో గ్రామ దేవతలకు ఎంతో విశిష్టత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి బుజ్జి, పోడెల జగన్నాథం, పోడెల చిన్నబ్బాయి, పోడెల వీరన్న దొర, పోడెల జనార్దన్, పోడెల ప్రసాద్, పైలా నాయుడు, లెక్కల సత్యనారాయణ, కొటకల లక్ష్మణ్, తేడా చిన్న, వారాది అప్పారావు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పరిశ్రమలు ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. జీవీఎంసీ 84వ వార్డులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరిపావారి వీధిలో రూ.11.50 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, డ్రైనేజీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు లేనిపోని తప్పుడు ఆరోపణలు, ప్రచారాలు చేస్తున్నాయని, వాటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలక యశోద రవి, కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీలబాబు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దిలీప్ కుమార్, నాయకులు మందపాటి జానకి రామరాజు, మల్ల బుల్లిబాబు, జాజుల రమేష్, కొణతాల మురళీకృష్ణ, కోరుకొండ రాఘవ, రమేష్, సకల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తంతడి సచివాలయం పరిధి దాసరపాలెం, అంగవానిపాలెం, పైలవానిపురం, రాజన్నపాలెం గ్రామాల్లో శుక్రవారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులతో మాట్లాడి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ తల్లి అనారోగ్యంతో మంచాన పడి ఉండగా, ఆమెను ఎమ్మెల్యే కన్నబాబు రాజు స్వయంగా వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మార్టూరు గ్రామానికి చెందిన రాయి ఉమామహేశ్వరికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన రూ.90వేలు చెక్కును వారి కుటుంబీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార వర్మ, వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, తంతడి ఎంపీటీసీ సభ్యురాలు రాజాన పద్మావతి అప్పారావు, కె.విమలా నాయుడు, మోటూరు సంజీవి, రాజన్న నానాజీ, కేకే రమేష్ బాబు పాల్గొన్నారు.



సిసి రోడ్లు, డ్రైనేజీలను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

రోడ్డు నిర్మాణం చేపట్టాలని పాదయాత్ర



అచ్యుతాపురం జంక్షన్‌లో రోడ్డు మురుగునీటిని పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

ప్రజాశక్తి-అచ్యుతాపురం

గుంతలతో అధ్వానంగా మారి, పలువురు మరణానికి కారణమైన అనకాపల్లి -అచ్యుతాపురం రహదారి పునర్నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరుతూ జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ ఆధ్వర్యాన శుక్రవారం అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం జంక్షన్‌లో రహదారిపై మురుగునీటి ప్రవాహాన్ని అరికట్టాలన్నారు. అచ్యుతాపురం నుంచి తిమ్మరాజుపేట మధ్య జరిగిన ప్రమాదాలు కారణంగా 32 మంది చనిపోయారని, ఉన్న అచ్యుతాపురం సెజ్‌లోని కంపెనీలకు రోజా వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ఈ రహదారి గుంతలుగా ఉండటంతో నిర్దిష్ట సమయానికి ఇళ్లకు చేరుకోలేకపోతున్నారని చెప్పారు. గుంతల వల్ల ప్రమాదాలు చోటుచేసుకొని ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వ అధికారులుగాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు టీవీఎస్ఎన్ రాజు, మోటూరు శ్రీవేణి, సరోజినీ, చొడిపిల్లి అప్పారావు, టెక్కలి పరశురాం, వేగి కుమార్, పలు గ్రామాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా వైసీపీ ప్రజాప్రతినిధులకు కనీస స్పందన లేదని విమర్శించారు. రహదారి విస్తరణలో నష్టపోతున్న నిర్వాసితులకు పునరావాసం, మెరుగైన ప్యాకేజీ కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వడిసెల నాయుడు, సిహెచ్.అప్పారావు, ఎం.శ్రీవేణి పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : జనసేన నేత విజయ్ కుమార్ చేపట్టిన పాదయాత్ర మునగపాక చేరుకున్న సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి తలమానికంగా



విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ సలహా మండలి సభ్యులు

మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ మండల వ్యవసాయ సలహా కమిటి సమావేశం శుక్రవారం చైర్మన్ కోన రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెసర, మినుము విత్తనాలు రైతు భరోసా కేంద్రాలలో 55 శాతం రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. మండలంలో 2300 మంది రైతులు పిఎం కిసాన్ ఇకెవైసి నమోదు చేసుకోవలసి ఉందని, వారు రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. లేకుంటే 13వ విడత పిఎం కిసాన్ నిధులు జమ కావని తెలిపారు. మండల వ్యవసాయాధికారి చంద్రావతి మాట్లాడుతూ రబీ పంట నమోదు త్వరలో ఆరంభమవుతుందన్నారు. పశు వైద్యాధికారి డాక్టర్ అశ్విని మాట్లాడుతూ సీజనల్ వ్యాధి నిరోధక టీకాలు అన్ని గ్రామాలలో వేయడం జరుగుతుందని తెలిపారు. గడ్డి విత్తనాలు కావలసిన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బండారు రాజశేఖర్, పోలిరెడ్డి అప్పారావు, కె.అయ్యబాబు, ఎంఆఇ నరసింహమూర్తి, విఎఎలు స్రవంతి, జ్యోతి, రైతులు అప్పారావు, పైడం నాయుడు పాల్గొన్నారు.

ల్యాండ్, శాండ్, గ్రావెల్ మాఫియాకు లీడర్ మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ల్యాండ్, శాండ్, గ్రావెల్ మాఫియాలకు లీడర్‌గా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన టిడిపి మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి అమర్నాథ్ అనకాపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేసారో చెప్పాలన్నారు. అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్లకు ఎన్ని నిధులు విడుదల చేస్తారో చెప్పాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కోట్ని బాలాజీ, తలారి కాశి నాయుడు, పచ్చికూర రాము, చెక్కల శ్రీను, సంబరు శ్రీను, అక్కిరెడ్డి రమణబాబు, కడిమిశెట్టి గణేష్, రేబాక ప్రసాద్, రేఖ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలతో సమీక్ష

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని నర్సింగిబిల్లి గ్రామీణ వికాస్ బ్యాంక్ పరిధిలోని స్వయం సహాయక సంఘాలతో బ్యాంకు అధికారులు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘం సభ్యులు తీసుకున్న బ్యాంక్ లింకేజీ అప్పుకు అసలు, వడ్డీ 3శాతం తగ్గకుండా ప్రతి నెలా చెల్లించాలని సూచించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ముందుగా లింగ వివక్షపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎస్.శ్రీనివాసరావు, సీసీ శ్రీను, విఓఎలు జోగిరత్నం, ఆదిలక్ష్మి, లక్ష్మి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఆశ్రమానికి ఆర్థిక సాయం అందించండి

ప్రజాశక్తి - చోడవరం : తమకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని ఏదైనా ఆశ్రమానికి అందజేయాలని బుచ్చయ్యపేట మండలం విజయ రామరాజు పేటకు చెందిన రాపేటి రాజు (పులి) కుటుంబ సభ్యులు గ్రామీణ వైద్యులను కోరారు. ఇటీవల మృతి చెందిన రాపేటి రాజుకు భార్య, కూతురు కొడుకు ఉన్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యులు, కొంతమంది ఆ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. అయితే రాజు కుటుంబ సభ్యులు తాము ఎలాగోలా జీవనం సాగిస్తామని, ఈ ఆర్థిక సాయాన్ని ఏదైనా ఆశ్రమానికిగాని, పేద పిల్లలకుగాని అందజేయాలని కోరారు. దీంతో గ్రామీణ వైద్యులు దొడ్డి అమిత్ కుమార్ ఈ సాయాన్ని మరొకరికి అందజేస్తామని తెలిపారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం, పిసిసి అధ్యక్షులుగా గిడుగు రుద్రరాజు నియామకం సందర్భంగా భారీ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిసిసి మెంబర్ తుట్ట రమణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వచ్చాయని, బిజెపికి రిటైర్మెంట్ దగ్గర పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి సంతోష్, బుద్ధ కిషోర్, గౌరీపట్నం గుణబాబు, పిల్లి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు అనాదిగా అన్యాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్రకు అనాదిగా అన్యాయం జరుగుతున్న నేపథ్యంలో బుందేల్‌ఖండ్ తరహాలో ప్యాకేజీ ప్రకటించి అభివృద్ధి చేయాలని ఆలిండియా బిసి ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు విల్లూరి పైడారావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సుజల స్రవంతి, పోలవరం, వంశధార ప్రాజెక్టుల విషయంలోనూ, గ్రోయిన్ల మరమ్మతు విషయంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి కీలక పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం, దీనిపై రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు వైసిపి, టిడిపిలు నోరెత్తకపోవడం దారుణమన్నారు.

యలమంచిలిలో రత్నాచల్‌కు హాల్ట్ కల్పించాలి

పార్లమెంట్ జీరో అవర్‌లో ప్రస్తావించిన ఎంపీ సత్యవతి

ప్రజాశక్తి-అనకాపల్లి

రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌కు యలమంచిలిలో హాల్టు కల్పించాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి సత్యవతి శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో రైల్వే శాఖ మంత్రిని కోరారు. రత్నాచల్ ట్రైన్ హాల్ట్ లేకపోవడంతో ఎలమంచిలి పరిసర ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్థానికులు ఈ విషయాన్ని తమ దృష్టికి తెచ్చినట్టు ఆమె చెప్పారు. ఎలమంచిలి నియోజకవర్గంలో ప్రత్యేక ఆర్థిక మండలి ఉండడంతో ఈ ప్రాంత వాసులకు ఈ ట్రైన్ హాల్టు ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. కనీసం ఒకటి రెండు నిమిషాలు ట్రైన్ హాల్టు కల్పించాలని కోరారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి -మాడుగుల: నిరుద్యోగులకు ఉపాధి కల్పించ డమే వైసిపి ప్రభుత్వం ధ్యేయమని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. శుక్రవారం మాడుగులలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్మెంట్‌తో విద్యార్థుల ఉన్నత చదువులకు తమ ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. నిరుద్యోగంతో సతమతమవుతున్న కుటుంబాలకు ఆసరాగా యువకులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే తమ ప్రభుత్వం పలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. ముందు ముందు వీటి సంఖ్య బాగా పెంచుతామన్నారు. అంతకుముందు స్థానిక గ్రామపంచాయతీ కమ్యూనిటీ భవనం వద్ద ఏర్పాటు చేసిన వైయస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. మాడుగుల నుండి రామచంద్రాపురం వరకు నిర్మాణం అవుతున్న తారు రోడ్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, ఎంపీడీవో మీనా కుమారి, తహసిల్దార్ పివి రత్నం, జెడ్‌పిటిసి రమణమ్మ, ఎంపీపీ పెదబాబు, వైస్ ఎంపీపీలు తాలపురెడ్డి రాజారాం, కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ ఎడ్ల కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాథ్ శ్రీనివాసరావు, పెరుమాళ్ళ వెంకటరావు, సేనాపతి కొండలరావు, సేనాపతి గంగాధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-నక్కపల్లి: రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. మండలంలోని దేవవరం గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి పండించిన రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి నిర్ణయం తీసుకుందన్నారు. వరికి క్వింటాకు రూ.2060 గ్రేడ్ ఏ రకముకు, సాధారణ రకము కు రూ.2040లు చెల్లించడం జరుగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణ, వైసిపి నాయకులు నర్సింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి సాయి లక్ష్మి, వ్యవసాయ సహాయకులు సురేంద్ర, రాజేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చీడికాడలో పొలంబడి

ప్రజాశక్తి - చీడికాడ: మండల కేంద్రంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని పొలంబడి సూపర్వైజర్ ఏ.హేమ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యవసాయంలో అవలంభించాల్సిన మెలకువలను వివరించారు. సాగు విధానంలో మెలకువలు అవలంభిస్తే రైతులకు అనవసర ఖర్చులు తగ్గుతాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈఆర్‌ఏ శ్రీనివాసరావు, గణేష్, రాజా, పాల్గొన్నారు.



మరమ్మతు చేపడుతున్న మెకానిక్‌లు

బోరు మరమ్మతు పనులు

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో కవగుంట గ్రామంలో శుక్రవారం సర్పంచ్ దాసరి సూర్య కుమార్ వరహాలు ఆధ్వర్యాన పరవాడ రమణ పశువుల పాకల సమీపంలో చేతిబారు మరమ్మతులు చేపట్టారు. గ్రామలోని ప్రజలకు, పశువులకు తాగునీటి అవసరాల నిమిత్తం ఈ బోరు ఎంతగానో ఉపయోగపడుతుందని సర్పంచ్ తెలిపారు. అలాగే గ్రామంలో పలు ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించారు. గ్రామంలో డ్రైనేజీల పూడితీత పనులు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. తాగునీటి, విద్యుత్ సౌకర్యం వంటి ప్రాథమిక అవసరాలు సమకూర్చడమే ధ్యేయంగా పని చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు.

దళారులకు విక్రయించొద్దు

వ్యవసాయ అధికారి శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి -చీడికాడ: మండలంలోని రైతు భరోసా కేంద్రాలకు రెండు రోజుల్లో గన్ని బ్యాగులు అందుబాటులోకి వస్తాయని, త్వరలోనే ధాన్యం కొనుగోలు చేస్తామని వ్యవసాయ అధికారి ఈఆర్‌ఏ శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి జయ ప్రకాష్ రావు వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఎర్ర అప్పారావు, పశు వైద్యాధికారిని జి.గాయత్రీ దేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, మండలంలో రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పండించిన పంటలను మద్దతు ధరకు అమ్మి గిట్టుబాటు ధరను పొందాలన్నారు. దళారీలకు పంటలు అమ్మి మోస పోవద్దన్నారు. ఈ క్రాఫ్ నమోదు చేసుకున్న ప్రతి రైతు కూడా ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఇంకా ఈకేవైసీ చేయించుకోని రైతులు వెంటనే ఆయ రైతు భరోసా కేంద్రాల్లో చేసుకోవాలని సూచించారు. గాయత్రి దేవి మాట్లాడుతూ, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందుల అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ పశువుల వైద్య సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఒల నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి -చీడికాడ: గ్రామ రెవెన్యూ అధికారుల (విఆర్ఒ) సంఘం అధ్యక్షునిగా జాజిమొగ్గల మోది నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారుల మండల కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా జాజిమొగ్గలు మోది నాయుడు, ఉపాధ్యక్షునిగా కోరుకొండ అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా డివిఏ సన్యాసిరాజు శ్రీను, సంయుక్త కార్యదర్శిగా కోడూరు శేఖర్‌రావు, కోశాధికారిగా గోగాడ వరాహమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


వీఆర్వోల సంఘం జిల్లా కమిటీకి ప్రతినిధిగా జైతవరం విఆర్ఓ కోడూరు గౌరీ శంకర్రావును, డివిజన్ కమిటీకి ప్రతినిధిగా బయలుపూడి విఆర్ఓ చలుగు సత్యనారాయణను ఎంపిక చేశారు. ఈ సమావేశంలో విఆర్వోలు కొండలరావు, రామ సత్యనారాయణ, ఈశ్వరరావు, సోము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజారావుకు అభినందనలు

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్: ఇటీవల డిఎఫ్ఎగా బాధ్యతలు చేపట్టిన రాజారావును శుక్రవారం స్వచ్ఛంద సేవా సంస్థ ప్ర తినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణ పై కార్యక్రమాలు చేయాలని, దీనికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. డిఎఫ్ఎ రాజారావు మాట్లాడుతూ, స్వచ్ఛంద సేవా సంస్థలు ఆదివాసి గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, విద్య, ఉపాధిపై పని చేస్తునందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సిరి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి గెడ్డం విజయలక్ష్మి, శ్రామిక రూరల్ డెవలప్మెంట్ సొసైటీ కార్యదర్శి మోపాడ రమణ, వికాసవాణి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి రిల్లు జగ్గారావు, ప్రగతి సిరి ఏపిఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం ఇస్తున్న సంస్థల ప్రతినిదులు



విరాళం అందిస్తున్న పైలా ప్రసాదరావు

ఆలయానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని కెజె పురం జంక్షన్‌లో సంతోషిమాత ఆలయానికి టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు శుక్రవారం రూ.10 వేల విరాళం అందించారు. ఉదయం ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అభివృద్ధికి విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాళ్ళ అమ్మతల్లి నాయుడు, రాపేటి జోగి నాయుడు, ఆడారి సన్యాసిరావు, పైలా యువసేన అధ్యక్షులు, దాడి రామ లక్ష్మణరావు, బొడ్డేటి వెంకటరావు, ఎల్లపు రాము, తనకల శివ, తదితరులు పాల్గొన్నారు.



మురుగునీటి కాలువలో లార్వా మందు వేస్తున్న సిబ్బంది

గ్రామాల్లో డ్రై డే

- దోమల నివారణ చర్యలపై అవగాహన

ప్రజాశక్తి-పాయకరావుపేట: శ్రీరాంపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 10 గ్రామ సచివాలయాల్లో శుక్రవారం డ్రై డేను పురస్కరించుకొని యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించినట్లు వైద్యాధికారులు పి.కావ్య, వై.తులసి తెలిపారు. దోమలు వృద్ధి చెందితే డెంగీ, చికెన్ గున్యా, మలేరియా ఫైలేరియా, మెదడువాపు సంక్రమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు తెలిపారు. ఇంటి పరిసరాల్లో పాత్రలు, డ్రమ్ములు, తొట్టెల్లో నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు వీటిలోని నీటిని తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా నోడల్ ఇన్‌చార్జి అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

చెత్త పన్ను వసూళ్లపై ఒత్తిడి తగదు

జివిఎంసి కమిషనర్‌కు వార్వా, నివాస్ వినతి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : చెత్త సేకరణ ఛార్జీల వసూళ్లపై సిబ్బందిని ఒత్తిడి చేయొద్దని, ఇప్పటికే జివిఎంసి పరిధిలో ఓ అధికారి ఒత్తిడికిలోనై మృతిచెందాడని వార్వా, నివాస్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు జివిఎంసి కమిషనర్ రాజబాబుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జివిఎంసి జోన్ -4 పరిధిలో సచివాలయ వార్డు పారిశుధ్య కార్యదర్శిగా పనిచేస్తున్న బాకూరి చంద్ర మోహన్ చెత్త సేకరణ రుసుము వసూలు విషయంలో అధికార్ల ఒత్తిడి తట్టుకోలేక గుండెపోటుతో మరణించినట్లు తెలిపారు. కౌన్సిల్ నిర్ణయానికి, పై అధికార్ల ఒత్తిడికి మధ్య చిరు ఉద్యోగులు నలిగిపోయి బలైపోతున్నారని చెప్పారు. రెండేళ్లుగా అనూహ్యంగా పెంచుతున్న ఆస్తి పన్ను, చెత్త సేకరణ ఛార్జీలు, ఇంపాక్ట్ ఫీజులతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే నగర ప్రజానీకం వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నట్టు చెప్పారు. పన్నుల భారం ప్రజలపై మోపడం దారుణమన్నారు. కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో వార్వా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ప్రకాష్‌రావు, బిబి.గణేష్, నివాస్ అధ్యక్ష, కార్యదర్శులు బి.గురప్ప, పిట్టా నారాయణ మూర్తి ఉన్నారు.

మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన కియా ప్రతినిధులు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : కియా ఇండియా సంస్థ ప్రతినిధులు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను శుక్రవారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ క్యాబ్ డాంగ్ లీ, లీగల్ హెడ్ యోగిల్మా, ప్రిన్సిపల్ అడ్వైజర్ టి.సోమశేఖర్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కియా కార్యకలాపాల గురించి మంత్రి అమర్‌నాథ్ కియా ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కియా వ్యాపార అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ వారితో మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తున్నామని, దానిలో పాల్గొనాలని కోరారు.


మంత్రికి కారు నమూనాను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు


ఆసుపత్రిలో నిలుచున్న గర్భిణీలు

సిహెచ్‌సిలో గర్భిణుల అవస్థలు

కూర్చునేందుకు ఏర్పాటు చేయని కుర్చీలు

ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రధానమంత్రి మతృత్వ యోజన పథకంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో పరీక్షలకు వచ్చిన గర్భిణీలు శుక్రవారం అవస్థలు పడ్డారు. కనీస వసతులు లేక ఇబ్బంది పడ్డారు.ప్రతి నెల 9న నిర్వహిస్తున్న పరీక్షలకు వచ్చే గర్భిణీలకు సిహెచ్‌సిలో కూర్చునేందుకు కుర్చీలు లేక పోవడంతో నిలుచూనే ఉండి పోయారు. మండల వ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సహా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద సుమారు 400 మంది వరకు ప్రతినెల పరీక్షలు జరుపుతున్నట్లు ఆరోగ్య విస్తరణ అధికారి గోవిందరావు తెలిపారు.

ఘనంగా ఐఐఎంఎం పినాకిల్ వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇంటెగ్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ మేనేజ్‌మెంట్ ఐఐఎంఎం పినాకిల్ ప్రతిష్టాత్మకమైన ఈవెంట్ 'నేషనల్ మేనేజ్‌మెంట్ కల్చరల్ ఫెస్ట్' ఎంవిపి.కాలనీలోని ఐఐఎంఎం ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. విశాఖపట్నం పోర్టు ట్రస్టు ఛైర్మన్ కె.రామ్మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఐఐఎంఎం డీన్ అండ్ సెక్రటరీ డాక్టర్ సుంకరి రవీంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూర్యతేజ ముత్యం మాట్లాడారు. గౌరవ అతిథులుగా మాజీ ఐఎఎస్ అధికారి కెవి.రావు, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఛైర్మన్ ఎంఆర్.రావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రహదారి ప్రమాదాలను నివారించాలని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం కోరారు. శుక్రవారం ఉదయం పెద్ద వాల్తేర్‌లోని కెడిపిఎమ్ హైస్కూల్, శివాజీ పాలెం ప్రాథమిక పాఠశాలల్లో ట్రాఫిక్ నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. విశ్రాంత డిప్యూటీ తహశీల్దార్ తిరునగరి సాయి ప్రకాష్, కెడిపిఎమ్ హైస్కూల్ హెచ్‌ఎం సుమతీబాయి పాల్గొన్నారు.

ఆందోళనలో అన్నదాతలు

▸▸గుబులు రేపుతున్న తుపాను ▸▸పలు చోట్ల పొలాల్లో కోసిన వరి పైరు


గొలుగొండలో వరి పంటను కోస్తున్న రైతులు



నక్కపల్లిలో రైతులను అప్రమత్తం చేస్తున్న వ్యవసాయ అధికారి ,సిబ్బంది

ప్రజాశక్తి-నక్కపల్లి: రైతుల్లో తుఫాను గుబులు రేకెత్తిస్తుంది. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో అన్నదాత ఆందోళనతో కొట్టుమిట్టాడుతున్నారు. చివరి గింజలు చేతికందే సమయంలో తుఫాను గండం రైతులకు కునుకు లేకుండా చేస్తుంది. మండలంలో ఈ ఏడాది వరి సాగు విస్తారంగా పండింది. రైతులు మండలంలో అన్ని గ్రామాల్లోనూ వరి సాగు చేసారు. అన్నిచోట్ల వరి కోత దశకు చేరుకుంది. ఇప్పటికే పలు గ్రామాల్లో రైతులు వరి కోతలు కోసి కుప్పలు వేసుకోగా, కొన్నిచోట్ల వరి పనలు పొలాల్లోనే ఉన్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వాతావరణం పూర్తిగా మారి పోవడంతో రైతులు అప్రమత్తమై వరి పొలాల్లో కోత కోసిన వరి పనులను కుప్పలు వేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. శుక్రవారం చిరుజల్లులు కురవడంతో రైతన్నకు చినుకు భయం పట్టుకుంది. కోత దశకు చేరుకున్న వరి చేతికి అందుతుందో లేదో అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి రైతులు వరి పంటను పండించారు. పలువురు రైతులు అప్పులు చేసి మరి పెట్టుబడులు పెట్టారు. ఈ దశలో తుఫాను ప్రభావంతో భారీ వర్షం కురిసినట్లయితే అన్నదాతకు తీవ్ర నష్టం జరుగుతుంది. అప్పుల ఊబిలో రైతులు కూరికి పోతారు.


కోటవురట్లలో ఒరిగిన వరి పైరు

తుఫాను హెచ్చరిక నేపథ్యంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ గొడిచెర్ల లో పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు. రెండు మూడు రోజులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోసి పొలాల్లో ఉన్న వరి పనలను వెంటనే కుప్పలు వేసుకోవాలని రైతులకు సూచించారు.

కోటవురట్ల: ఆరుగాలం కష్టపడి పండించిన పంట మాండూస్ తుఫాను రైతన్నల్లో ఆందోళన కలిగిస్తుంది. మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో దాదాపు 1914 హెక్టార్లలో వరి సాగు చేశారు. చివరి దశకు చేరుకున్న వరి పంట కోతకు సిద్ధమవుతున్న తరుణంలో శుక్రవారం వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. దీంతో, రైతులు కూలీల కొరతతో ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుండి తేలికపాటి చిరుజల్లులు పడుతుండటంతో రైతులు మరింత ఆందోళన మొదలైంది. కొన్నిచోట్ల పంట పూర్తిగా పండిన తరుణంలో వర్షం అధికమైతే నేలపాలు అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


రోలుగుంటలో కోసిన పనలు

రోలుగుంట: మాండోస్ తుపాన్ అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో కలవరపడుతున్నారు. మండలంలో వాతావరణంలో మార్పుల నేపథ్యంలో వరి రైతులు హడావుడిగా పంటను కుప్పలుగా వేస్తున్నారు. ఇంకా 50 శాతం విస్తీర్ణంలో వరి పైరు పక్వానికి వచ్చి కోతకు సిద్దంగా ఉంది. పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ కారణంగా పంటలు దెబ్బతింటాయో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కుప్పలు పెట్టేందుకు పరుగులు

బుచ్చయ్యపేట: తుపాన్ నేపథ్యంలో శుక్రవారం చిన్న చిన్న చినుకులు పడడంతో రైతులు తమ పొలాల్లోని వరి చేను కుప్పలుగా పెట్టేందుకు పరుగులు తీశారు. శుక్రవారం ఉదయం నుండి వాతావరణ మబ్బుగా ఉంది. మధ్యాహ్నం సమయానికి చిన్న చిన్న చినుకులు ప్రారంభమయ్యాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. కోసిన వరి పంటను కుప్పలుగా పెట్టడానికి ఇబ్బందులు పడ్డారు. మండలంలోని బుచ్చయ్యపేట, కందిపూడి, చిన్నప్పన్నపాలెం, పెద్దమదిన, గున్నెంపూడి, సీతయ్యపేట, తురకలపూడి గ్రామాల్లో రైతులు ఉదయం నుండి పొలాల్లోనే వరి పంటను కుప్పలుగా పెట్టే పనిలో నిమగ్నమై ఉన్నారు. పలు గ్రామాల్లో ఆర్‌జెఎల్ రకం ఇంకా కోత కోయకుండా పొలాల్లోనే ఉంది.

వరి చేను కోతలు ముమ్మరం

గొలుగొండ: ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో ఈ ఏడాది 6వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. విప్పలపాలెం, దారపాలెం, రావణాపల్లి ప్రాంతాల్లో వాతావరణం అనుకూలంగా ఉండటంలో పంటలు బాగా పండాయి. అన్ని ప్రాంతాల్లో ఒకేసారి కోతలు ప్రారంభం కావడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. అధిక కూలీ ఇవ్వాల్సి రావడంతో సాగు వ్యయం పెరుగుతోందని రైతులు వాపోతున్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఈ నెల 9, 10, 11 తేదీల్లో తుపాన్ కారణంగా వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం హెచ్చరిక నేపథ్యంలో రైతుల వరి కోతలను వాయిదా వేసుకోవాలని అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం కోసిన వరి పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల్లో చిన్న చిన్న కాలువలు తవ్వుకోవాలని, దీనివలన వర్షం పడిన ఆ కాలువల ద్వారా నీరు పోతుందని తెలిపారు. ఇప్పటికే కోసిన వారు వెంటనే ఎక్కడికి అక్కడ కుప్పలు పెట్టుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించాలని కోరారు. ఆయన వెంట మండల స్పెషల్ ఆఫీసర్ రవీంద్ర, మండల వ్యవసాయ అధికారి ఎల్‌వై కాంతమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.


రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు